




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 202 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 28 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :202 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 28 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





## ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

- ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్
- ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి
- చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం
- ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక
- అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య

మిగతా 2లో




## ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

### చైనా హ్యాకర్ల కొత్త ఎత్తుగడ

- ప్రపంచ టెలికాం నెట్‌వర్క్‌లే లక్ష్యంగా చైనా హ్యాకర్ల దాడి
- నెట్‌వర్క్‌లలో 'డిజిటల్ స్లీపర్ సెల్స్' తరహా మాల్‌వేర్ చొప్పిస్తున్న వైనం
- బీపీఎఫ్‌డోర్ అనే లినక్స్ ఆధారిత మాల్‌వేర్‌తో రహస్య గూఢచర్యం
- దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 నివేదికలో కీలక హెచ్చరికలు

మిగతా 2లో



# కమణీయం సీతారాముల కల్యాణం

భక్తజనసంద్రమైన భద్రాచలం



## బాలరాముడికి సూర్య తిలకం


- అయోధ్యలో అద్భుత దృశ్యం
- స్వామివారి నుదుటిని తాకిన కిరణాలు
- అంబరాన్నంటిన శ్రీరామనవమి వేడుకలు

మిలమిల మెరిసిపోయిన మిథిలా స్టేడియం

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

వివరాలు 2లో..



## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

### ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు


- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం
- సామాన్యుడికి మేలు చేసే నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు న్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్

మిగతా 2లో

## నాపై హత్యాయత్నం జరిగింది



- ఆకివీడులో రామాలయం వద్ద రఘురామపై దాడికి యత్నం
- ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అన్న రఘురామ
- వేరే మతం ముసుగులో ఉన్నవారు దాడి చేశారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:శ్రీరామనవమి పర్వదినాన ఆకివీడులోని పెదపేట రామాలయం వద్ద ఓ వర్గానికి చెందిన వ్యక్తులు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఏపీలో కలకలం రేపింది. ఈ దాడిపై రఘురామ స్పందిస్తూ... తనపై జరిగిన దాడి కేవలం ఆకస్మికం కాదని, అది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అని ఆరోపించారు. నిన్న సాయంత్రమే బయటి ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆకివీడుకు చేరుకున్నారని, రాళ్లు, కత్తులు, మేకులతో తనపై దాడి చేసేందుకు వాళ్లు వచ్చారని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో



## సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

### టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలని దిశానిర్దేశం

పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష

ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ

ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం

చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల


మిగతా 2లో

## ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

### ఇజ్రాయెల్ మంత్రి హెచ్చరిక

- పౌర ప్రాంతాలపై దాడులు వద్దని కోరుతున్నామన్న కాట్జ్
- ఇరాన్ మాత్రం దాడులు ఆపడం లేదని ఆగ్రహం
- అందుకే దాడులు తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరిక

మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

### ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ ధన్యవాదాలు

- పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై పూర్తిగా ఎక్సైజ్ సుంకం రద్దు
- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయమన్న లోకేశ్
- ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుందని ప్రశంస

పెన్ పవర్ డెస్క్:పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట

మిగతా 2లో



## వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- సీతారాముల కల్యాణం నిర్వహించిన వైసీపీ నేతలు
- వేడుకల్లో పాల్గొన్న సజ్జల, వెల్లంపల్లి తదితర నేతలు
- శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు అంటూ జగన్ ట్వీట్

పెన్ పవర్ డెస్క్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల



మిగతా 2లో

## మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

### కేంద్ర మంత్రి కీలక ప్రకటన



- దేశంలో లాక్‌డౌన్ వార్తలు పూర్తిగా అవాస్తవమన్న కేంద్రం
- ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి
- అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ కొరతతో పెరిగిన ఊహాగానాలు
- ప్రధాని వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ప్రభుత్వ వర్గాల వెల్లడి

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మరోసారి లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియా సహా, కొన్ని వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### తెలుగు సినీ రంగ అగ్రనటుడు

చిత్తూరు నాగయ్య (1896– 1973) తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిన మహా నటుడు. భక్తి ప్రధాన పాత్రలు, చారిత్రక, సామాజిక పాత్రల్లో ఆయన అపూర్వమైన ప్రతిభను కనబరిచారు. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు నాట అగ్రశ్రేణి కళాకారుడిగా గుర్తింపు పొందారు. చిత్తూరు నాగయ్య 1896 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, రేపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య శర్మ. చిన్ననాట నుండే నాటకాలపై ఆసక్తి పెంచుకున్న నాగయ్య, విద్యాభ్యాసం పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం చేపట్టారు. అయితే, ఆయన హృదయం కళలపైనే ఆసక్తిగా ఉండడంతో, ఉద్యోగాన్ని వదిలేసి నాటక రంగంలో ప్రవేశించారు. సంగీతంపై గాఢమైన ప్రేమ ఉండటంతో కర్ణాటక సంగీతం లో శిక్షణ తీసుకున్నారు. నాగయ్య తన నటనా ప్రస్థానాన్ని నాటకాల ద్వారా ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బిల్లా – రంగనాథం వంటి నాటకాలలో ఆయన అద్భుతంగా నటించి, ప్రేక్షకుల అభిమానం పొందారు. ఆయన భావ ప్రదర్శన, సంభాషణా నైపుణ్యం, సంగీత ప్రతిభ నటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాటక రంగంలో అందరినీ ఆకట్టుకున్న నాగయ్య, సినిమాల వైపు మళ్ళారు. 1937లో "గృహలక్ష్మి" చిత్రంతో నాగయ్య సినీ రంగంలో అడుగు పెట్టారు. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆయన ప్రధానంగా పౌరాణిక, భక్తి ప్రధాన, చారిత్రక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి, తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి ఎదిగారు. నాగయ్య నటించిన కొన్ని అత్యంత ప్రఖ్యాత చిత్రాలలో...భక్త పోతన (1942)లో పోతనగా ఆయన నటన అపురూపం, త్యాగయ్య (1946)లో త్యాగరాజ స్వామిగా ఆయన జీవించేసినంత గొప్ప నటన, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1939)లో శ్రీవేంకటేశ్వరునిగా విశిష్టమైన నటన మరపు రానివి. అలాగే భక్త రామదాసు (1943)లో భక్త రామదాసుగా నటించి ప్రేక్షకుల గుండెల్లో నిలిచి పోయారు. యోగి వేమన (1947)లో యోగి వేమన పాత్రలో అద్భుతమైన అభినయం చూపారు. స్వర్గసీమ (1945)లో సామాజిక చిత్రంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించారు. మల్లీశ్వరి (1951)లో ముఖ్యపాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. దేవదాసు (1953)లో కీలకపాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు."త్యాగయ్య" చిత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ఇది భారతీయ సినీ చరిత్రలో తొలి జీవిత చరిత్ర (బయోపిక్) సినిమా గా చరిత్ర సృష్టించింది. నాగయ్య గొప్ప గాయకుడు కూడా. ఆయన తన సినిమాల్లో చాలా పాటలు స్వయంగా పాడేవారు. ముఖ్యంగా భక్తి గీతాలు, కీర్తనలు ఆయన గొంతులో అద్భుతంగా ప్రతిధ్వనించేవి. నాగయ్య నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా గుర్తింపు పొందారు. ఆయన స్వీయ దర్శక త్వంలో "త్యాగయ్య" సినిమాను నిర్మించి, జాతీయ అవార్డు గెలుచు కున్నారు. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో సంగీత కారుల జీవితాలను ఆధారంగా తీసుకుని నిర్మించిన తొలి చిత్రం. సినిమారంగంలో గొప్ప స్థాయికి ఎదిగిన నాగయ్య, జీవితాంతం కళా రంగానికి అంకిత మయ్యారు. అయితే, జీవితాంతం సినిమా రంగానికే అంకితమై ఉన్నా, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ 1973 డిసెంబర్ 30న, చెన్నైలో మరణించారు. తెలుగు సినిమాకు భక్తి రస ప్రధాన పాత్రలలో మూడో కన్నుగా నిలిచారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ నటుల్లో ఒకరు. సినిమా ద్వారా సంగీతాన్ని ప్రజలకు చేరువ చేశారు. నేటికీ ఆయన నటన, గానం మనసులో నిలిచేలా ఉంటుంది. చిత్తూరు నాగయ్య తెలుగులో తొలి మహా నటుల్లో ఒకరు. భక్తి ప్రధానమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, సినీ రంగంలో తనదైన సుస్థిరమైన స్థానం సంపాదించారు. నటన, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం ? ఇలా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

# కమణీయం సీతారాముల కల్యాణం

భద్రాచలం: దక్షిణ అయోధ్య భద్రాచలంలోని మిథిలా స్టేడియం లో రాములోరి షెండ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ సుట్టం పా రంభమైంది. భక్తజనం జయజయధ్వానాల మధ్య సీతమ్మను జగదానందకారకుడైన శ్రీరాముడు వరణ యమాడాడు. అభిజిత్ మూహూర్తంలోమధ్యాహ్నం 12గంటలకు సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్య చారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వ హించారు. ఆలయ అధ్యకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి అమ్మ వార్త కళ్యాణం కనులారా తిలకించేందుకు లక్షల మంది జనం మిథిలా స్టేడియానికి తరలిరావడం తో పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఆ ప్రాంతమంతా జైశ్రీరామ్' నినాదంతో మార్మోగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి సీఎం రేవంత్ రెడ్డి. గీత దంపతులు వస్త్రాలు, ముత్యాల తలంబ్రా లు సమర్పించారు. ఈ కళ్యాణోత్స వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వ రరావు, పొంగులేటి శ్రీనివాస్టి, అడ్లూరి లక్ష్మణ్,. కొండా సురేఖ. ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాలరాముడికి సూర్య తిలకం**

అయోధ్య: బాలరాముడు కొలువైన అయోధ్యలో శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృ తమైంది.

మధ్యాహ్నం సరిగ్గా 12గంటలకు స్వామి వారికి సూర్యకిరణాల తో తిలకం దిద్దారు. నాలుగు నిమిషాల పాటు సూర్యకిరణాలు రామ్లల్లా నుదుటిపై ప్రసరించాయి. బాల రాముడి దర్శనానికి దేశనలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో అయోధ్యలోని భవ్య రామ మందిరం భక్తుల తో కిటకిటలాడుతోంది. అంతకుముందు సరయూ నదిలో పుణ్యస్నానాలు చేసి ఆచరించారు. కాగా.. ఇది రామ్లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన వచ్చిన మూడో శ్రీరామ నవమి కావడం గమనార్హం.

# ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

ప్రపంచవ్యాప్తంగా టెలికాం మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చైనాకు చెందిన ఓ హ్యాకింగ్ గ్రూప్ అత్యంత ప్రమాదకరమైన సైబర్ దాడులకు పాల్పడుతోందని ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ హ్యాకర్లు దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యం కోసం టెలికాం నెట్‌వర్క్‌లలోకి రహస్యంగా మాల్‌వేర్‌ను చొప్పిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 (ఘుజూఅం7) తన నివేదికలో హెచ్చరించింది. ఈ హ్యాకర్లు "డిజిటల్ స్లీపర్ సెల్స్" తరహాలో పనిచేసే అత్యాధునిక టూల్స్‌ను వాడుతున్నారని నివేదిక తెలిపింది. కెర్నల్-స్థాయి ఇంప్లాంట్లు, పాసివ్ బ్యాక్‌డోర్స్ వంటివి నెట్‌వర్క్‌లలో చాలాకాలం పాటు గుర్తించబడకుండా దాగి ఉండేందుకు వీలు కల్పిస్తాయి. తద్వారా, వ్యవస్థలను నిశ్శబ్దంగా పర్యవేక్షిస్తూ, తమ ఉనికి బయటపడకుండా హ్యాకర్లు యాక్సెస్‌ను కొనసాగిస్తారు. ప్రభుత్వ, కీలక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడమే వీరి లక్ష్యమని నిపుణులు భావిస్తున్నారు. ఈ దాడుల్లో "బీపీఎఫ్‌డోర్" అనే లినక్స్ ఆధారిత బ్యాక్‌డోర్‌ను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్టు రాపిడ్7 గుర్తించింది. ఇది సిస్టమ్ కెర్నల్‌లోనే దాగి ఉంటూ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను గమనిస్తుంది. డేటా ప్యాకెట్లలో ఒక ప్రత్యేకమైన రహస్య సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ఇది యాక్టివేట్ అవుతుంది. సిస్కో, ఫోర్టినెస్, వీఎమ్‌వేర్, ఇవాంటీ వంటి ప్రముఖ కంపెనీల సిస్టమ్స్‌లోని లోపాలను హ్యాకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.కేవలం ఒక్కో సిస్టమ్‌ను హ్యాక్ చేయడమే కాకుండా, టెలికాం నెట్‌వర్క్‌లకు గుండెకాయలాంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పట్టు సాధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని నివేదిక స్పష్టం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థల వెన్నెముకనే లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఈ దాడులు అత్యంత ప్రమాదకరమని సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో డేటా ప్రవాహాన్ని పర్యవేక్షించడం, సేవలకు అంతరాయం కలిగించడం వంటివి చేసే అవకాశం హ్యాకర్లకు లభిస్తుంది.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.

అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా

నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

- మొదటి పేజి తరువాయి

తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. దేశంలో లాక్‌డౌన్ విధించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించే లక్ష్యంతో ఆయన ఈ స్పష్టతనిచ్చారు.

"భారత్‌లో లాక్‌డౌన్ విధిస్తారనే వదంతులు పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వ పరిశీలనలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదు. ఇలాంటి సమయంలో ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐక్యంగా ఉండటం ముఖ్యం. వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం బాధ్యతారహితమైన చర్య, హానికరం" అని హర్దీప్ సింగ్ పురి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధనం, సరఫరా వ్యవస్థలు, నిత్యావసరాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు ఇంధనం, ఇతర నిత్యావసరాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు, దేశంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై నెలకొన్న కొన్ని వార్తల నేపథ్యంలో లాక్‌డౌన్ విధించవచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి తోడు 2020లో విధించిన లాక్‌డౌన్‌కు ఆరేళ్లు పూర్తయిన సందర్భం కూడా కావడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది.అంతేగాక పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంటులో మాట్లాడుతూ "సన్నద్ధంగా ఉండాలి" అని చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అన్వయించారు. కోవిడ్ తరహా సన్నద్ధత అంటే పరిపాలనాపరమైన ముందుజాగ్రత్త చర్యలే తప్ప, ప్రజల కదలికలపై ఆంక్షలు విధించడం కాదని ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఈ క్రమంలోనే లాక్‌డౌన్‌పై వస్తున్న అన్ని రకాల ఊహాగానాలకు తెరదించుతూ కేంద్ర మంత్రి తాజాగా ఈ ప్రకటన చేశారు.

# కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

- మొదటి పేజి తరువాయి

చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నా రు."కఠినమైన, సవా లుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటప డుతుంది. నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం.ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరపున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది.నేడు అనేక దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

# నాపై హత్యాయత్నం జరిగింది

- మొదటి పేజి తరువాయి

వందేళ్ల చరిత్ర ఉన్న ఈ రామాలయాన్ని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, వారు హిందువులే అయినప్పటికీ వేరే మతం ముసుగులో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయాన్ని శుభ్రం చేయడానికి కూడా వారు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. దాడి చేసిన వారు రామ భక్తుల వేషంలో ఉండి ఒక్కసారిగా విరుచుకుపడ్డారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని వెల్లడించారు. లేనిపక్షంలో పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. ఇలాంటి వికృత చేష్టలను ఆదిలోనే అరికట్టకపోతే అవి సమాజానికి పెద్ద ముప్పుగా మారతాయని రఘురామ హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించానని, వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ తెలిపారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, గల్ఫ్, ఇజ్రాయెల్ దేశాల్లో పౌర ప్రాంతాలపై క్షిపణి దాడులు చేయవద్దని తాను, ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ ఇరాన్‌ను హెచ్చరించినట్లు తెలిపారు. కానీ ఇరాన్ మాత్రం పౌర ప్రాంతాలపై దాడులు ఆపడం లేదని మండిపడ్డారు. పదేపదే హెచ్చరించినప్పటికీ ఇరాన్ దాడులు ఆపడం లేదని, ఈ నేపథ్యంలో ఆ దేశంపై దాడులను తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరించారు. ఇరాన్‌లోని మరిన్ని ప్రాంతాలు లక్ష్యంగా దాడులు చేస్తామని పేర్కొన్నారు. ఈ యుద్ధ నేరానికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వ్యాఖ్యానించారు.

**క్షిపణి తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం**

టెహ్రాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఈరోజు తెలిపింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలోని క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్లు వెల్లడించింది. కాగా, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలవుతోంది. ఈ కాలంలో ఇరాన్‌పై 850కి పైగా తోమహక్ క్షిపణులను అమెరికా ప్రయోగించింది.

# వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- మొదటి పేజి తరువాయి

అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.

# పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

- మొదటి పేజి తరువాయి

కల్పించేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.10 తగ్గించారు, డీజిల్ పై పూర్తిగా రద్దు చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుంది. ఇంధన కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నుంచి ప్రజలకు ఉరటనిస్తూ ఇంధన ధరలు పెరగకుండా భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని మోదీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

## గుర్తుతెలియని కారు ఢీ... ముగ్గురికి గాయాలు, మహిళకు చేయి విరుగు



**స్టాఫ్ రిపోర్టర్,కొయ్యూరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చి 27:**కొయ్యూరు మండలం రామరాజుపాలెం బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడగా, ఓ మహిళకు చేయి విరిగింది. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం గమనార్హం.స్థానికుల
వివరాల ప్రకారం, ఘాట్ ప్రాంతం నుంచి కేడీపేట వైపు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్న రెండు బైక్‌లను గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో చింతపల్లి మండలం తప్పలమామిడి గ్రామానికి చెందిన తాంబెల సురేష్ (23), మువ్వల మంగుడు (28), తాంబెలి సాంబా (24) గాయపడ్డారు.అలాగే గూడెం మండలం ఎర్రచెరువులు గ్రామం, లక్కవరపుపేట పంచాయతీకి చెందిన లోచెల మంగకుమారి (33) ఎడమ చేయి విరిగినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలు తెలియాల్సి ఉంది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 26:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్ ఎ స్ ఎ" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న "జీరో వేస్ట్ ఇన్‌స్టి ట్యూషన్స్" కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవం తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎ న్. హరేందిర ప్రసాద్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నాల్గవ శనివారం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాల యాలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు. ఉదయం 6 గంటల నుంచే కార్యాలయ ప్రాంగణాలు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.ప్రతి కార్యాలయం "జీరో వేస్ట్" లక్ష్యాన్ని సాధించే దిశగా వ్యర్థాల వర్గీకరణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పునర్వినియోగ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాలను నిర్వహించి, వాటిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచిం చారు.అదేవిధంగా, నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అదే రోజు మధ్యాహ్నం లోపు ౹ాూూూ యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" లక్ష్యాన్ని సాధిం చేందుకు కట్టుబడి ఉండాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.



## అగ్నిప్రమాద బాధితురాలికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి సాయం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 27 :** అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యు వతికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థిక సహాయం అందించారు. ఎస్సీ మాల కు లానికి చెందిన ఏనుగుపల్లి దేవి అనే యువతి కాళ్లు కాలిపోవడంతో చికిత్స పొందుతున్న విషయం స్థానిక వార్డు వైసీపీ అధ్యక్షుడు ము త్తాబత్తుల రమేష్ ద్వారా తెలుసుకున్న వాసుప ల్లి, ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.
అల్లిపురం 33వ వార్డు కుమ్మరి వీధిలో నివసిస్తు న్న దేవి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, వైద్య ఖర్చుల కోసం తన సొంత నిధుల నుండి రూ. 5000 నగదును అం దజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధి కారంలో ఉన్నా లేకున్నా ప్రజా సేవలో ఎప్పుడూ ముందుంటానని తెలిపారు.మదర్ తెరిసా సేవా భావం, అంబేద్కర్ ఆలోచనా విధానం తనకు స్ఫూర్తిగా నిలిచాయని, సంపాదనలో కొంత భాగాన్ని అవసరమైన వారికి సహాయం చేయ డం అలవాటుగా మారిందని వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు ము త్తాబత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరప ల్లి రాము, జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామరాజు, జిల్లా అంగన్వాడీ విభాగం వైస్ ప్రెసిడెంట్ కొల్లి సత్యవతి, వార్డు మహిళా అధ్య క్షురాలు హేమ, యూత్ ప్రెసిడెంట్ బుర్రలు చిన్న, సౌత్ ప్రెసిడెంట్ సూర్య, జిల్లా నాయకులు పీవీఎన్ రెడ్డి, రాము, సోషల్ మీడియా రాము, దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో కోదండ రామాలయంలో

**వైభవంగా పూజలు అన్నదానానికి విరాళం**



**బిమిలి , పెన్ పవర్, మార్చి 27 :**శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని హుకుంపేటలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వ హించబడ్డాయి. ఆలయం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శిం చుకున్నారు.ఈ సందర్భంగా 'చిన్న శ్రీను సోల్జ ర్స్' ఉపాధ్యక్షుడు తోట వాసు అన్నదాన కార్యక్రమం కోసం ఆలయ కమిటీకి రూ.5,00 0ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సామాజిక సేవలో భాగంగా ఈ విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు.అలాగే తన కుటుంబ సభ్యుల పేరున తోట వాసు ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. తన అన్నయ్య మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వదిన మజ్జి పుష్పాం జలి, వారి కుమార్తె సిరమ్మ, అల్లుడు ప్రదీప్ నాయుడు పేర్లతో స్వామివారిని ప్రార్థించి, కు టుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు మరియు సమాజ శ్రేయస్సు కోసం కోరుకు న్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## శ్రీ సీతారాముల కళ్యాణం దృశ్యం మాలిక










## కనులపండువగా సీతారాముల కళ్యాణం



- రామతీర్థంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 27 :** చారిత్రాత్మక పుణ్యక్షేత్రం రామతీర్థం నీలాచల కొండవద్ద వెలసిన సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. 'ఉత్తర అయోధ్య'గా పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరాగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల



శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిలు హాజరై, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఉదయం నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య, వేద పండితుల మంత్రోచ్చారణలతో అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం అభిజిత్ లగ్నమందు నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. శ్రీరామనవమి పర్వదినం సమాజానికి ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను గుర్తు చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం మరియు కల్యాణ వీక్షణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం



నాగమాధవి దంపతులు, ఎమ్మెల్సీలు గాదే శ్రీనివాసులు నాయుడు, పెనుమత్స సూర్యనారాయణ రాజు, సింహాచలం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు, ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ దంపతులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా శ్రీరాముని కళ్యాణానికి విచ్చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, పోలీస్ యంత్రాంగం తాగునీరు, ప్రసాదం, వైద్య సదుపాయాలు మరియు భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బాధితులకు అండగా మేము సైతం..

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చ్ 27 .** చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయ పురంలో నివాసముంటున్న దువ్వారి సాయికృష్ణ గత మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితమై అనారోగ్యంతో అష్ట కష్టాలు పడుతున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం నాడు ఆ కుటుంబానికి పదివేల రూపాయలు విరాళాన్ని వితరణగా అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా ప్యారా పీర్ఝుం వ్యాధితో బాధపడుతున్న సాయి కృష్ణ కుటుంబానికి అండగా నిలబడాలి అనే నేపథలో కు మేము సైతం సభ్యులు అండగా నిలిచారు. మందులకు కనీసం డబ్బులు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న కుటుంబాన్ని ఆదుకోవాలని నేపథ్యంలోని మేము సైతం సభ్యులు స్పందించి కుటుంబానికి అండగా నిలిచారు. స్వచ్ఛనంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి కష్టాల ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా సంఘ సభ్యులకు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సభ్యులు స్విజి శ్రీనివాసరావు, అద్దూరి సీతబాబు, వలిరెడ్డి రవీంద్రనాయుడు, సూరు కుమార్, కిల్లంశెట్టి సన్యాసిరావు, బలగ రామారావు, పొట్నూరు నర్సింగరావు, సూరు వెంకటేశ్, ఉరిటి రమణ, కేవీ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

- రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 27 :** ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలు కలిగి ఉండాలని, ప్రజలకు సేవ చేసేందుకు నాకు మరింత శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని ఆ శ్రీరాములువారిని వేడుకున్నానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం పట్టణం పాతబస్టాండ్లో ఎంతో చరిత్ర కలిగిన శ్రీరాములవారి ఆలయాన్ని ఆయన సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరాములువారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

అనంతరం ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర. పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు నాకు శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని, నియోజకవర్గ ప్రజలంతా సస్యశ్యామలంగా ఉండాలని, అందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కల్పించాలని ఆ భగవంతున్ని వేడుకున్నానన్నారు. మరోసారి ప్రజలందరికీ పేరుపేరునా శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా చుక్క వలస పాఠశాల వార్షికోత్సవం ...



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 27.** చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని చుక్క వలస ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు స్కూల్ చైర్మన్ శనపతి జగన్నాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమమును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గరివిడి మండల విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతో అలరించాయి. అంతేకాకుండా ఈ పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన రాజు మాస్టారు, రాజశేఖర్ మాస్టారు, రాము నాయుడు మాస్టారులను ఘనంగా సన్మానించారు. అలానే తెలుగుదేశం నాయకులు శనపతి సత్యన్నారాయణను కూడా పాఠశాలకు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలకు మెచ్చి ఆయన కూడా అభినందిస్తూ సన్మానించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రమేష్ చంద్ర మాస్టార్ ని కూడా ఆయన చేస్తున్న సేవలకు గాను సన్మానించడం జరిగినది. అలానే మిగతా ఉపాధ్యాయులను కూడా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చుక్క వలస పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ , నాగమణి, జగదీష్ ,శ్రావ్య , స్వప్న , శోధన సిబ్బందిగ్రామ ఉపసర్పంచ్ కే వెంకటరమణ ,సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఫోక్స్ కోర్టు జడ్జ్..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 27 .** చీపురుపల్లి పట్టణమును వెలసిన శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని జిల్లా ఫోక్స్ కోర్టు జడ్జి కే నాగమణి శుక్రవారం నాడు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఆలయ ఉద్యోగులు, ఆలయ పండితులు, ప్రోటోకాల్ ప్రకారం ఆమెకు ఘన స్వాగతం పలికారు, గౌరవప్రదంగా దుస్సాలను కప్పి సన్మానించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందజేసి చిత్రపటాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కోర్టు సిబ్బంది ఆలయ సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మవారికి పుట్టింటి సారె ...





**చీపురుపల్లి పెన్ పవర్ మార్చ్ 27 .** చీపరుపల్లి పట్టణంలోని పాత కుమ్మర వీధికి సంబంధించిన ప్రజలంతా శుక్రవారం నాడు శ్రీరామనవమి సందర్భంగా దేశం లో అన్ని రామ మందిరాల్లో రాముల వారి కళ్యాణం వైభవోపేతంగా జరుపుకుంటున్న నేపథ్యంలో సీతమ్మవారికి పుట్టింటి సారి ను సమర్పించారు,అందులో భాగంగా శ్రీరామనవమి శుభ సందర్భంగా చీపురుపల్లి మండలంలో ఉన్న కస్పావీధి రామ మందిరం ప్రాంగణంలో

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నులు పండుగగా ఘనంగా నిర్వహించడం జరిగింది.


పాత కుమ్మరి వీధి వాసులు అందరూ కలిసి ప్రతి ఇంటి నుండి పిండి వంటలు, పళ్ళు కాయలు, పట్టువస్త్రంలు, తాళిబొట్లు, పసుపు కుంకుమ, గాజులు, మెట్టెలు, తలంబ్రాలు, సారి సామానులతో కాలనీ పెద్దలు, యువత మహిళాలు, పిల్లలు ఊరేగింపుగా మేళ తాళాలతో సీతమ్మవారికి పుట్టింటి తరుపున సారెను కస్పావీధిలో కొలువైన కోదండరామస్వామి ఆలయములో ప్రధాన అర్చకులకు సమర్పించారు.కాలనీవాసుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధులు గా పాల్గొన్న వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, చీపురుపల్లి జడ్పిటిసి సభ్యులు వలిరెడ్డి శిరీష, సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతమ్మ సారేను కాలనీ మహిళలు తలపై మోసుకుని మేళతాళాలతో ఊరేగింపు గా పాత కుమ్మరి వీధి, సెగిడివీధి, దేవాంగుల వీధి, కస్పావీధి మీదుగా రామ మందిరానికి చేరుకొని రాముల వారి కళ్యాణంలో సారే సమర్పించారు.అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని

శ్రీ సీతారాముల కల్యాణం ను వీక్షించారు.ఈ సందర్భంగా ప్రజలందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన,జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జడ్పీటీసీ శిరీష దంపతులు

లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనది, తర తరాలకు ఆదర్శనీయమైనది. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని ఆ దివ్యమూర్తులను ప్రార్థిస్తూ

ప్రజలందరికీ "శ్రీరామ నవమి శుభాకాంక్షలు" తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న వారిలో విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జడ్పిటిసి సభ్యులు వలి రెడ్డి శిరీష, ప్రభాత్ కుమార్ , మీసాల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ గుప్తా,చందక శ్రీను, ఊలపల్లి బసవన్న, సోపేటి జగదీశ్వరరావు, సోపేటి కనకరాజు, దయంత్రి సురేష్,దయంత్రి సతీష్, సబ్బి నాగు, చందక భవాని, నారాయణశెట్టి సోమేశ్, అశోక్, కాలనీ పెద్దలు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు..

## ఎన్నికల సంఘమే కీలకం.. ఎన్నికల సంఘం పారదర్శకంగా నియమించబడాలి




– జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మ రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 27 :** ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలిగే శక్తి ఒక్క ఎన్నికల సంఘానికి ఉంటుందని, అటువంటి ఎన్నికల సంఘాన్ని పారదర్శకంగా నియమించాల్సిన బాధ్యత ఈ పాలకులపై ఉందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అభిప్రాయపడ్డారు. జనవిజ్ఞాన వేదిక, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఎన్నికల కమిషన్ పనితీరు అన్న అంశంపై చర్చ వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారడం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీకి అనుకూలంగా, ప్రతికూలంగా కాకుండా ప్రజాస్వామ్య ఐక్యవేదిక ప్రజల హక్కులను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల సంఘాన్ని నియమించాల్సిన బాధ్యత ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కి ఉన్నప్పటికీ,ఎన్నికల నియామకం ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. గడిచిన ఎన్నికల నుండి చూస్తే ఎన్నికల సంఘం ప్రజల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎన్నికల సంఘం తీరువల్ల ప్రజలు ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే హక్కును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టిఎన్ శేషన్ ఎన్నికల ప్రధాన అధికారిగా ఎన్నో సంచలనాత్మకమైన నిర్ణయాలతో ఎన్నికల సంఘం హక్కులను,బాధ్యతలను ప్రజలకు తెలియజేశారని, అటువంటి సంఘాన్ని నిర్వీర్యం చేసే దిశగా నేటి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల అధికారులను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించాల్సి ఉన్నప్పటికీ నేటి పాలకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తప్పించి ఆ స్థానంలో క్యాబినెట్ మంత్రికి ఎన్నికల సంఘాన్ని నియమించే బాధ్యతలకు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు.

ప్రజాస్వామ్య ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌతారపు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఎన్నుకునే హక్కు లేకుండా చేస్తుందని అభిప్రాయపడ్డారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుల గంద్రేటి లక్ష్మణరావు, గంద్రేటి అప్పలనాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పైల రమేష్ రాజు,జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్,జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎరుకొండ ఆనంద్, డాక్టర్ మిరియాల కృష్ణారావు, పి.షణ్ముఖరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జి.శ్రీరాములు,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జగమంతా రామమయం..

శ్రీరామనవమి వేడుకలు పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం





**హుకుంపేట పెన్ పవర్ మార్చ్ 27:** అల్లూరు సీతారాముల జిల్లా అరకు నియోజకవర్గం, హుకుంపేట మండల కేంద్ర పరిధిలో గల కొంతిలి గ్రామపంచాయతీమరియు గ్రామంలో జరిగిన శ్రీరామనవమి పర్వదిన వేడుకల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు

ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ శ్రీరాముడి దివ్య ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆ సీతారాముల కృపతో అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు,మరియు సిరిసంపదలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రజలకుఅయన శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం అల్లూరి సీతారామరాజు జిల్లా పి.ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తమర్బా కొండయ్య పడల్,మాజీ ఎంపీపీ తామర్బ సత్యమాధవి పడాల్,కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఉత్సవ కమిటీ రైజింగ్ స్టార్ మహిళలు పాల్గొని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

అనంతరం అన్నదాన కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొనారు.

పలువురు మహిళలకు దుస్సాలువతో సన్మానం చేశారుఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు మరియు ,హుకుంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి అనిల్ ,హుకుంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ సమ్మిడ వెంకట పూర్ణిమ ,అల్లూరి జిల్లా వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్ ,రేగం శివరాం హుకుంపేట వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు కాకారి వెంకట్రావు మరియు భక్తులు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అశోక్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

భారత్ ఆదివాసీ పార్టీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 27:** ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందలం అశోక్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు డిమాండ్ చేసారు.బెంతి ఒరియా కులాన్ని గిరిజన జాబితాలో కలుపొద్దని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందలం ఆశోక్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఆదివాసీ నాయకులు హుందాగా, మర్యాద గా మాట్లాడుతున్నా సమయంలో ఒక ఆదివాసీ యువకుడిపై వ్రాయలేని భాషను ఉపయోగిస్తూ,ఆఫ్ నాలెడ్జ్ పీపుల్, బాస్టర్డ్ అంటూ ఎమ్మెల్యే అశోక్ తిట్టడం బాధాకరం.అదే భాషను లేదా అంతేకంటే ఎక్కువ కూడా ఆదివాసీలు ఉపయోగించగలరు,కానీ ఆదివాసీలు సభ్యతతో మెలిగారు.అదే భాషను ఆదివాసీలు ఉపయోగించి ఉంటే ఆ ఎమ్మెల్యే మొఖం ఎక్కడ పెట్టుకొనేవాడని,ఆదివాసీలపై దళితులపై సామాన్యంగా కన్నెర్రజేసిన,కోపంతో చూసిన,తిట్టిన, కొట్టిన,పరుష పదజాలం ఉపయోగించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టవచ్చు.ఈ ఎమ్మెల్యేపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సుమోటాగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపెట్టి కఠినంగా శిక్షించాలని,

క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పుకొనే చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే అశోక్ ను తెలుగుదేశంపార్టీ నుండి సస్పెండ్ చేయాలని,పార్టీలకు అతీతంగా ఆదివాసీ రాజకీయ నాయకులు,ఆదివాసీ సంఘాలు స్పందించాలని ఆయన కోరారు.

# వంట గ్యాస్ పై ప్రజలు అవస్థలు.



* నల్ల బజారులో 1500/ నుండి 3000/ రూపాయలకు అమ్మకాలు.
* కృత్రిమ కొరత సృష్టిస్తున్న భారత్ గ్యాస్ డీలర్లు. ఆందోళనలో వినుయోగదారులు..

**అరకులోయ పెన్ పవర్ 27:**ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్రాఊటీ అందాల అరకులోయ నియోజకవర్గం పరిధిలో వంట గ్యాస్ సిలిండర్ల పై ప్రజలు అవస్తలు,నల్లబజారులో తరలిపోతున్న వంట గ్యాస్ సిలిండర్ల,ఒక సిలెండర్కు 1500/ నుండి 3000/ రూపాయలకు అమ్మకాలు జరుపుతున్నారని వినియోగదారులు గగ్గోలు.అరకులోయ గ్రామస్తులకు వంటగ్యాస్ వినియోగదారులకు భారత్ గ్యాస్ డీలర్లు చుక్కలు చూపిస్తున్నారనీ అరకులోయ నియోజకవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ఇద్దరు భారత్ గ్యాస్ డీలర్లు ఉన్నప్పటికీ సకాలంలో వంట గ్యాస్ అందక, మహిళలు వినియోగదారులు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారనీ పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. నల్ల బజారులో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ 1500/ నుండి 3000/ వరకు అమ్ముకుంటూ వినియోగదారులను నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ అవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గ్యాస్ నిల్వలు ఉన్నప్పటికీ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని,భారత్ గ్యాస్ డీలర్లు నల్ల బజారులో అధిక రేట్లకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనీ, దీనిపై సివిల్ సప్లై అధికారులకు గ్యాస్ డీలర్ల పై ఫిర్యాదులు అందుతున్నప్పటికీ, చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారనీ అరకులోయ నియోజకవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలర్లు మాత్రం ఇష్టారాజ్యంగా... యదేచ్ఛగా గ్యాస్ సిలిండర్ల అమ్మేసుకుంటున్నారనీ. దీనిపై గ్యాస్ కంపెనీల అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు,సివిల్ సప్లై అధికారులు... డీలర్లపై తక్షణమే చర్యలు తీసుకొని ప్రజా అవసరాలకు సరిపడా గ్యాస్ సక్రమంగా సరఫరా జరిపించవలసిందిగా మహిళలు, ప్రజా సంఘాలు,గ్యాస్ వినియోగదారులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేస్తున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## 66 వార్డులో సీతారాముల కళ్యాణం మహోత్సవం





**గాజువాక: పెన్ పవర్, మార్చి 27:**జివియంసి 66 వార్డులో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం సుధా హోటల్ దగ్గర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబు షాపింగ్ మాల్ సుబ్బారావు ,బాబురావు ఆధ్వర్యంలో పానకం , ప్రసాదం పంపిణీ చేశారు. వినాయక నగర్ హౌస్ ఓనర్స్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం కైలాష్ నగర్ కమ్యూనిటీ హోల్ నందు, గాజువాక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం , మార్వాడి సంఘం వారు ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కణితి రోడ్డు లో 15 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు . ముఖ్య అతిథిలుగా గాజువాక 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ , మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ , కార్పొరేటర్ గంధం.శ్రీనివాస్ ,మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాంబాయి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు భాష్యం త్రినాథ్ , నెల్లి సాధురావు ,పొన్నాడ రమణ ,గంటా నారాయణరావు ,చిత్తా తారకేశ్వరరావు ధనరాజ్ మిశ్రా రెడ్డి 66 వార్డ్ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు స్వర్ణపుడి సత్యనారాయణ వర్తక సంఘం నాయకులు పుసర్ల వెంకటేష్ , నంబూరి జగన్నాథం , సతీష్, కేసారపు శ్రీను, భగవాన్ శ్రీను , వర్తక సంఘం సభ్యులు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నాతవరం రామాలయం వద్ద కన్నుల పండగగా శ్రీరామనవమి.....



**నాతవరం,పెన్ పవర్ (మార్చి 27):** మండల కేంద్రమైన నాతవరం రామాలయం వద్ద శుక్రవారం శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని భక్తులు వీక్షిస్తుండగా కడు రమ్యంగా జరిపారు.వేద పండితుల మంత్రోచ్చారణలతో జి.రాజా లావణ్య దంపతులు సీతారాముల కళ్యాణం నిర్వహించారు.ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని కనులారా తిలకించి తీర్థ ప్రసాదం స్వీకరించారు.అనంతరం కమిటీ వారు వచ్చిన భక్తులకు భారీ అన్న సమారాధనను కూడా ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కమలతోటలో తాగునీటి సంక్షోభం.





బురద నీరే ప్రాణాధారం, ప్రజల్లో ఆగ్రహం.

**అరకులోయ పెన్ పవర్ 27**: అరకులోయ మండలం మారుమూల మాదల గ్రామపంచాయితీ పరిధి కమలతోట గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది.గ్రామంలో సుమారు 46 కుటుంబాలు ఉన్నాయని, 250 జనాభా కలిగిఉన్నమని గ్రామస్తులు కలుషితమైన బురద గెడ్డ నీరే తాగాల్సిన దుస్థితి నెలకొంది. ఒరిస్సా సరిహద్దు అంపవల్లి సిమెంట్ ఫ్యాక్టరీ వినియోగించిన కాలుషితం గడ్డనీరు త్రాగటం వల్ల గతంలో గ్రామస్తులు అనారోగ్యంతో రోగాల బారినపడ్డామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని సేవించడం వల్ల అనారోగ్య సమస్యలు పెరిగి, కొందరు మంచానికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.
సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. తాగునీటి వంటి ప్రాథమిక అవసరాన్ని కూడా తీర్చలేకపోతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు మారినా గ్రామానికి శాశ్వత తాగునీటి పరిష్కారం మాత్రం కనిపించకపోవడం ఆశ్చర్యకరం. అభివృద్ధి మాటల్లోనే మిగిలిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు.ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, ఈ గ్రామంలో సుమారు 10 పి.వి.టి.జి కుటుంబాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క పీఎం జన్మన్ ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలుస్తోంది. అతి వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నప్పటికీ, అవి ఇక్కడ అమలుకావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.అరకులోయ మండల కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్లు దూరంలో ఉంటుందన్నారు,రక్షిత మంచినీరు శాఖ అధికారులు స్పందించాలని, విద్యుత్ మోటార్ పంపు ద్వారా ఇంటింటికి మంచినీరు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీటి సమస్యపై వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని, అలాగే పీఎం జన్మన్ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, జిల్లా గృహనిర్మాణం శాఖ అధికారులకు,మంచినీటి శాఖ అధికారులకు పిర్యాదు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

## వేసవిని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ చలివేంద్రశీ ఏర్పాటు






**గాజువాక: పెన్ పవర్, మార్చి 27:**శ్రీరామనవమి సందర్భంగా మహాత్మా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జాగారపు శ్రీను ఆధ్వర్యంలో ముఖ్య అతిధిలుగా న్యూపోర్ట్ సీఐ , ట్రాఫిక్ ఎస్ ఐ చేతుల మీదగా ప్రారంభించి పానకం మజ్జిగ పంపిణి చేశారు. అండి బోయిన అప్పారావు, లక్ష్మీ దంపతులు ,బచ్చల త్రిమూర్తులు, నెల్లి సాధు రావు, నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, బొడ్డేపల్లి సంతోష్ కుమార్, దాసరి జ్యోతిరెడ్డి , వరుణ్ కుమార్, సుదమల్ల నరసింగరావు, శ్రీను అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు, రాజకీయాల అతీతంగా మహాత్మా మదర్ థెరిస్సా ఆశయాలతో గత 16 సంవత్సరం నుంచి ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని సమాజానికి సేవ చేయాలని ఉద్దేశంతో ద్రాహం తీర్చడానికి సొంత నిధులతో, మిత్రులు , శ్రేయోభిలాషులు సహకారంతో వివిధ ప్రాంతాల్లో చలివేంద్రం ఏర్పాటు చేశారు.

## జీకే వీధిలో 30వ తేదీ ఉచిత వైద్య శిబిరం




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 27:** జీకే వీధి మండలం కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో ఈ నెల 30వ తేదీ సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు.హైదరాబాద్కు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ అక్యుపంచర్ నేచురోపతి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని గూడెం కొత్త ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, సర్పంచ్ కోర్ర సుభద్ర, జనసేన ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్ వెల్లడించారు.ఈ శిబిరంలో ఎటువంటి రసాయన ఔషధాలు లేకుండా అక్యుపంక్చర్ చికిత్స ద్వారా శరీరంలోని నాడీ వ్యవస్థ పనితీరును పరిశీలించి అన్ని వయసుల వారికి పూర్తిగా ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని శిబిరానికి హాజరై ఉచిత వైద్య సేవలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ముక్కల రమేష్,బీజేపీ నాయకులు రిమల పాల్,హ్యూమన్ రైట్స్ బత్తుల రాజు, గూడెం కొత్త వీధి వైద్య సిబ్బంది, ఉద్యోగులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి బాల్ బ్యాట్మెంటన్ విజేతలకు బహుమతులు ప్రధానం....




**నాతవరం,పెన్ పవర్ (మార్చి 27):** మండల కేంద్రమైన నాతవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్ బ్యాట్మెంటన్ విజేతలకు శుక్రవారం మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు,ఎస్సై తారకేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు,క్రీడల్లో రాణించి తమ ప్రాంతానికి,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లాస్థాయి బాలికల విభాగంలో గోపాలపట్నం ప్రథమ స్థానం,నాతవరం హై స్కూల్ ద్వితీయ స్థానం,శాంతినికేతన్ స్కూల్ తృతీయ స్థానం రాగ వారికి షీల్డ్ అందజేశారు. అలాగే బాలుర విభాగంలో గోపాలపట్నం ప్రథమ స్థానం,చోడవరం ద్వితీయ స్థానం, కేడీపేట తృతీయ స్థానం రాగా వీరికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు,ఉప సర్పంచ్ కరక అప్పుల రాజు, జీవి రెడ్డి రాజబాబు, సీతారాం, మండల సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి, పినిరెడ్డి పండు,శెట్టి లోవ,గొల్లు లోవరాజు, పోలి రెడ్డి రాజు, శెట్టి లత్సబాబు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం కమనీయం సీతారాముల కళ్యాణం

**గాజువాక: పెన్ పవర్, మార్చి 27:**జివియంసి 65 వ వార్డు బానోజీ తోట వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో సీతారాముల కళ్యాణం కడుగురాములయ్యముగా భక్తులచే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ చైర్మన్, ధర్మకర్త వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉష శ్రీనివాసచార్యులు,మాధవాచారి చేతులు మీదుగా కళ్యాణం నిర్వహించారు .ముఖ్య అతిథులు మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగ భారతీయ హిందూ సంస్కృతిలో అత్యంత పవిత్రమైనదని తెలిపారు. శ్రీరాముడి జీవితం సత్యం, ధర్మం, న్యాయం,కర్తవ్య నిష్ఠలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడి ఆదర్శాలను అనుసరించి జీవించాలని సూచించారు.ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని, ప్రపంచంలో నేడు శాంతి



వాతావరణం నెలకొనాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు, తలంబ్రాలు వడపప్పు పానకం వితరణ జరిగినది.ఈ కార్యక్రమంలో సుబ్బరాజు రామలక్ష్మి



దంపతులు, పెంటకోట నాగేశ్వరరావు , రామక్రిష్ణ, బి. వెంకటేష్,తిరుపతిరావు, పెంటకోట రాజు, రుకుమంద్ర రావు మరియు ఆలయ సేవకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్తగా డ్రోన్ పరీక్షా విమానం నిలిపివేత



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 27:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ సేవల పనితీరును పరిశీలించే క్రమంలో నిర్వహించిన పరీక్షా విమానాన్ని అధికారులు ముందస్తు జాగ్రత్తగా నిలిపివేశారు. పాడేరు నుంచి ముంచింగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం వరకు డ్రోన్ ప్రయోగాత్మక ప్రయాణం చేపట్టగా, గాలి వేగంలో అసాధారణ మార్పులు గమనించడంతో అప్రమత్తమైన సాంకేతిక బృందం వెంటనే చర్యలు చేపట్టింది.గురువారం మధ్యాహ్నం 3:40 గంటలకు పాడేరు నుంచి బయలుదేరిన డ్రోన్, సుమారు 400 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో ఎయిర్‌స్పీడ్ రీడింగ్స్‌లో స్వల్ప వ్యత్యాసం గుర్తించారు. భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆటోమేటెడ్ మార్గాన్ని నిలిపివేసి, పైలట్ మాన్యువల్ నియంత్రణలోకి తీసుకున్నారు.పెదబయలు సమీపంలోని గంపరాయి గ్రామం, బోయితేలి వద్ద జనసమ్మర్థం లేని ఖాళీ ప్రదేశాన్ని గుర్తించి డ్రోన్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం ఏదీ సంభవించలేదని అధికారులు తెలిపారు. డ్రోన్ కూడా ఎటువంటి దెబ్బతినకుండా సురక్షితంగా ఉందని సాంకేతిక సిబ్బంది పేర్కొన్నారు.డ్రోన్ ల్యాండ్ అనంతరం స్థానికులకు పరీక్షా ప్రయాణం ఉద్దేశం, సాంకేతిక కారణాల వివరాలను బృందం తెలియజేసింది. ప్రజల్లో ఎటువంటి ఆందోళన కలగకుండా పారదర్శకంగా వ్యవహరించారు. అనంతరం డ్రోన్‌ను విడదీసి బేస్ క్యాంప్‌కు తరలించారు.గాలి వేగ వ్యత్యాసానికి గల కారణాలపై ఫ్లైట్ లాగ్‌లను విశ్లేషిస్తున్నామని, సెన్సార్లను పునఃపరిశీలిస్తున్నామని సంబంధిత సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఘటనపై జిల్లా అధికారులకు పూర్తి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## శ్రీ సాయి బాలాజీ నగర్ భావన హెవెన్స్ అపార్ట్మెంట్ లో రాములోరి కళ్యాణ మహోత్సవం





**కూర్మన్నపాలెం పెన్ పవర్, మార్చి 27:**భావన హెవెన్స్ అపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసులు, చుట్టుపక్కల అపార్ట్మెంట్ వాసులు అందరూ శ్రీరాముని కళ్యాణంలో .

పాల్గొని భక్తి శ్రద్ధలు తో పూజలు నిర్వహించారు. అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీరాములు కళ్యాణం భక్తి శ్రద్ధలతో అందరూ కూడా జరుపుకోవాలని, దేశం సుభిక్షంగా ఉండాలి అని, శ్రీరాముడు ఆశీస్సులు, కరుణ కటాక్షాలు అందరి మీద చూపాలని కోరారు.కళ్యాణ మహోత్సవం లో తిరుమలశెట్టి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, నిజాంపట్నం శ్రీనివాస్, విజయ భారతి దంపతులు పాల్గొన్నారు.

## అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**స్టాఫ్ రిపోర్టర్ కొయ్యూరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చీడిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగవరం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన పాము రాజు, నాగమణి దంపతుల తాటాకు ఇల్లు ఈ నెల 14వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో కుటుంబం సర్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బాధితుడు పాము రాజు గత ఆరు సంవత్సరాలుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జీకే వీధి మండలానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో దుమంతి రామకృష్ణ, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు కూడా బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

# జీవం ఉన్న పంటలతో శబల భోజనాల పండుగ

- ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం
- ప్రకృతి పంటలే ఆరోగ్యకరం, ఆనంద దాయకం
- జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు
- ఆకుల చలపతి రావు, రాష్ట్ర అధ్యక్షులు, ఎపి నర్సరీ అసోసియేషన్




**విశాఖ మార్చ్ 27(పెన్ పవర్):**జీవం ఉన్న పంటలతో శబల భోజనాల పండుగ నిర్వహిస్తున్నామని ఎపి నర్సరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల చలపతి రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల లో "శబల భోజనాల పండుగ" కోసం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది అన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అన్నారు. ప్రధానంగా ప్రకృతి పంటలే ఆరోగ్యకరం, ఆనంద దాయకం అని వివరించారు. అలాంటి జీవం ఉన్న పంటలతో మన పూర్వీకులు వంటలు ఎలా చేసుకున్నారో అలాంటి రుచి కరమైన, సుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వండటం, భుజించడం, అవగాహన కలిగించడం కోసం ఏప్రిల్ 1 నుంచి 5 వ తేదీ వరకూ శబల భోజనాలు పండుగ నిర్వహించడం జరుగుతోంది అన్నారు.

ఈ కార్యక్రమంలో తులసి నేచురల్స్ సత్యనారాయణ మాట్లాడుతూ సబల భోజనాలు పండుగలలో ఉత్తరాంధ్ర సాంస్కృతిక కళల ప్రదర్శన నిర్వహించడం జరుగుతోంది అన్నారు. అలాగే పాత ఇత్తడి, మట్టి పాత్రలలో వంటడం జరుగుతుంది అని వివరించారు. జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు అన్నారు. మనం మన సాంస్కృతిని, కళలను కాపాడుకోవాలి అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎం ఆర్ ఎన్ వర్మ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు ఈ శబల భోజనాలు పండుగలలో పాల్గొనాలని, జయప్రదం చేయాలని, విస్తారంగా ప్రచారం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతు గుంటూరు జగన్నాద రాజు, మేంగొ మేన్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

శబల భోజనాల విశిష్టత

శబల కామధేనువు బిడ్డ అప్పుడు కౌశికుని (విశ్వామిత్రుని) పరివారము అందరికీ తక్కువ సమయములో పోషకాయుక్తమైన, రుచికరమైన ఆహారమును కామధేనువు బిడ్డ అయిన శబల అందించింది. ఇప్పుడు నిర్వీర్యమైన మన పొలాలలోని మట్టిని, ప్రకృతి ఆధారంగా ఉన్న ఎరువు ద్వారా మట్టిలోని జీవుల వైవిధ్యమును పెంపొందించడం తద్వారా మట్టి లోని సారమును పెంచి తక్కువ సమయములో ఎక్కువ మందికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారమును మరియు ఎక్కువ మందికి ఉపాధిని శబల బిడ్డలు అయిన గోవులు ద్వారా అందిస్తాం

## 87వ వార్డులో భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు





**కూర్మాన్న పాలెం : పెన్ పవర్, మార్చి 27:** మహా విశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డు పరిధిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం పాల్గొన్నారు. వార్డు పరిధిలో వడ్లపూడి, అప్పికొండ, కణితి గాంధీ బొమ్మ జంక్షన్, గవరవీధి, దుగ్గవాణిపాలెం గ్రామాలలో ఉన్న ఆలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారని,ఉదయం నుంచి ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారని. ఆ భగవంతుని ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని జగన్ కోరారు.అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు, డివి అప్పారావు, ప్రగడ దానయ్య, మల్లా రాము,అప్పలనాయుడు,డీవీ సూరిబాబు, బొడ్డ సన్యాసి,దుగ్గపు రాజేంద్రప్రసాద్,శిరసపల్లి అప్పలరాజు ,దేమ్ముళ్లు, సైకిల్ షాప్ రాజు,కిరణ్, బంగారు రాజు, వడ్లపూడి ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కణితి రామాలయ ఆలయ కమిటీ సభ్యులు, అప్పికొండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు, దుర్గపువానిపాలెం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతంలో వాడవాడలా రాములోరి కళ్యాణ మహోత్సవాలు





**గాజువాక పెన్ పవర్, మార్చి 27:**జీవీఎంసీ 66 వార్డులో పలు ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కణితి రోడ్డు, వర్తక సంఘం, ఆర్యవైశ్య సంఘం, పూసర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి రోడ్లో, భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులతో 66వ వార్డులో చాలా చక్కగా శ్రీరామనవమి కార్యక్రమంలో కులానికి మతాలకి అతిథిగా ప్రతి ఒక్కరూ పాల్గొని పారిశ్రామిక ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ఆ రాములవారు ఆశీస్సులు పారిశ్రామిక ప్రాంతం కుటుంబాలపై ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఆహ్వానించిన కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం, కైలాష్ నగర్, పాత మున్సిపల్ ఆఫీస్ ప్రాంతం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కైలాష్ నగర్ హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో, కుంచుమాంబ గుడి ఎదురుగా జరిగిన కార్యక్రమం చీటీల రెడ్డి, రఫీ ఎస్ బి టి, రాజారావు బ్రదర్స్ ఆధ్వర్యంలో, కణితి రోడ్లో సురేష్ బృందం ఆధ్వర్యంలో ముఖ్యంగా బాబు టెక్స్టైల్స్ వారు మంచి ఏర్పాట్లు చేశారని, ప్రతి ఒక్కరికి ప్రసాదాలు పంచుతూ ఈ భగవంతుడి కార్యక్రమంలో భాగస్వాములు చేసినందుకు గోమాడ వాసు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు .

## జై శ్రీ రామ్ నామస్మరణ తో మారుమ్రోగిన నగరం



**విశాఖ తూర్పు,పెన్ పవర్, మార్చి 27:** విశాఖ తూర్పు నియోజకవర్గం పలు ప్రాంతాలలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం సందర్భంగా జైశ్రీరామ్ నామస్మరణతో పురవీధులు పులకించాయి. భారీ అన్నసమారాధనలు, పలు సంఘాలు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు రామరసం భక్తులకు అందజేశారు తెల్లవారు నుండి రామాలయాలు భక్తులతో కిటికీటలాడాయి. ఆరిలోవ పలు వార్డులలో ఎర్నిదుర్గ నగర్ సేవా సంఘం రామాలయం. తోట గరువు ఈస్ట్ ద్వారక కృష్ణ ఆలయం, శ్రీ మురళీకృష్ణ ఉత్సవ కమిటీ, ఆరిలోవ పద్మశాలి సేవ సంఘం, రాజు క్యాటరింగ్ సప్లై, గాంధీనగర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం, శ్రీకాంత్ నగర్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ, ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వైసీపీ తూర్పు సమన్వయకర్త మొల్లిఅప్పారావు.టిడిపి జిల్లా నాయకులు ఒమ్మి సన్యాసిరావు.13వ వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,గాంధీనగర్ కాకి గంగరాజు,ఒమ్మి అప్పలరాజు, నీలి పైడిరాజు.పిల్లి వీర్రాజు. పాత్రకొండ ధర్మారావు,డాక్టర్ నాయుడు. తిప్పబోయిన కోటేశ్వరరావు. తదితరులు పాల్గొనీ శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



## రాజీవ్ నగర్ లో ఘనంగా శ్రీ రామ నవమి వేడుకలు





**కూర్మన్నపాలెం: పెన్ పవర్ మార్చి 27:**పారిశ్రామిక ప్రాంతం గాజువాక, రాజీవనగర్ లో గల శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు .

ఈ కళ్యాణంలో వార్డ్ టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, నాగసుజని దంపతులు రాములవారి తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా సీతారాముల కళ్యాణాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమములో పాల్గొనే గొప్ప భాగ్యన్ని దయచేసిన ఆలయ కమిటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని సీతారాములను వేడుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించి స్వామి దర్శనం చేసుకున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాయుడు నాగేశ్వరావు, సాగి సునీల్, కే మురళీకృష్ణ, రాజశేఖర్, పోతురాజు, రమణారావు, నాయుడు, వెంకటేష్, సాగి శ్రీనివాస రాజు, రామకృష్ణ రాజు, అప్పలస్వామి,కోటేశ్వరరావు,శివపరావతి, బేబీ కుమారి, సుజాత, స్థానిక నాయకులు రమేష్, సుబ్బయ్య, గణపతి, జగదీశ్, సింహాద్రి, గోవింద్ నాగరాజు, బుజ్జమ్మ, రుక్మిణి, రాధ, సత్య, తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్......



**నాతవరం,పెన్ పవర్ (మార్చి 27):** మండలం లో గల వల్సంపేట గ్రామ సమీపం జీడి తోటల్లో కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు.వీరు నుండి రెండు కోడిపుంజులు,600 రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కోడిపందాలు,పేకాట ఆడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

# పెంటమాంబ ఆలయం ఎదురుగా ఉన్న స్టీల్ ప్లాంట్ భూములను కాపాడాలి





**గాజువాక పెన్ పవర్, మార్చి 27 :** జివియంసి 75వ వార్డు, పెదగంట్యాడ శ్రీ పెంటమాంబ ఆలయం ఎదురుగా కబ్జాకు గురైన 2 ఎకరాల స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూలగొట్టి, వారిపై తక్షణమే కఠిన చర్యలు - అ ప్రాంతాన్ని సుమారు 2 కోట్లతో అధునాతన పార్కు గా ఉక్కు నిర్వాసిత ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జివియంసి 75వ వార్డ్ , పెంటమాంబ ఆలయ ఎదురుగా, సర్వే నెంబరు 79లో కోట్లు విలువ చేసే, సుమారు 5ఎకరాల స్టీల్ ప్లాంట్ స్థలములో, దాదాపు 2 ఎకరాల స్థలం కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. వీటిలో వారి వ్యాపార కార్యకలాపాల కోసం ఫ్లాట్లుగా విభజించి ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయం స్థానిక గ్రామస్తులు నీలాపు వీధి, ముసలి నాయుడు పాలెం, పాత అయ్యన్న పాలెం, కోరాడ గ్రామస్తులు ద్వారా వినతి పత్రాలు స్వీకరించిన విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి మొల్లి పెంటిరాజు, మార్చి 9వ తేదీన జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. నేటికి ఎటువంటి స్పందన లేదు. సంబంధిత అధికారులు తమకు ఏమీ తెలియనట్టు ఉంటున్నారు.


స్థలాన్ని 75 వార్డుకు చెందిన కూటమి నాయకులతో కలిసి మొల్లి పెంటిరాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 5ఎకరాల స్థలం స్టీల్ ప్లాంటు సంబంధించినదని, ఈ స్థలాన్ని నిర్వాసిత గ్రామాలైన ప్రజా అవసరాలకు, గ్రామస్తులకు అందుబాటులో తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని, ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు . ఈ ప్రాంతంపై తనకి పూర్తి అవగాహన ఉందని రానున్న రోజుల్లో సుమారు 2 కోట్లతో, అధునాతన పార్కుగా డెవలప్ చేసి నిర్వాసిత ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, ఈ స్థలంలో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ఆ కట్టడాలను కూల్చివేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాన్ని పర్యటిస్తానని పల్లా శ్రీనివాసరావు గారు తెలిపారని మీడియా సమావేశంలో తెలియజేశారు.

సంబంధిత అధికారులు వెంటనే ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారులు స్పందించిన ఎడల గ్రామస్తులందరితో కలిసి ఈ స్థలంలో ఉన్న అక్రమ కట్టడాలను ప్రజలచేతే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఒక సామాన్యుడు ఇల్లు కట్టుకుంటే ఒక్క అడుగు పెరిగిన, పర్మిషన్ లేవని, వారి కట్టడాలని కూల్చివేసే అధికారులు ఇంత పబ్లిక్ గా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తుంటే ఎందుకు మౌనం దాలుస్తున్నారు.

ప్రస్తుతం గంగవరం అధాని పోర్టు కాలుష్యం వలన ఈ ప్రాంతం వారు చాలా ఇబ్బంది పడుతున్నారని, పోర్టు వలన వచ్చే కాలుష్యంలో కొంత భాగానైనా కంట్రోల్ చేయాలని, దీనిలో భాగంగా ఈ స్థలం చుట్టూ చెట్లను నాటి ఈ ప్రాంతాన్ని పార్కు గా అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల ఉన్న ప్రాంత ప్రజలకు పోర్టు కాలుష్యం నుంచి కొంత ఉపశమనం కలుగుతుందని, గతంలో ఈ ప్రాంతంలో హత్యలు, దోపిడీలు, కొట్లాటలు, గంజాయి బ్యాచ్లు, దొంగతనాలకు పాల్పడే వారికి అడ్డగా ఉండేదని అన్నారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలందరికీ ఉపయోగపడేలా అధునాతన పార్కుగా తయారుచేసి, వీధి దీపాలతో రోడ్లను కూడా అనుసంధానించి, అభివృద్ధి చేయాలని ప్రణాళికలు వేసుకున్నామని మీడియా ద్వారా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు, జనసేన నాయకులు దాసరి జ్యోతి రెడ్డి, నీలాపు శ్రీనివాస రెడ్డి, కోన చంటి, బిజెపి నేతలు కిల్లాని ముసలయ్య, లక్ష్మి, టిడిపి నేతలు టెకేటి అప్పారావు, కడవల రమణ, ఉరుకూటి వెంకట్రావు, నక్కా గంగరాజు, పెదపూడి అప్పలస్వామి పాత అయ్యన్న పాలెం, ముసలి నాయుడు పాలెం, నీలాపు వీధి గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న బెహరా చైతన్య





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 27 :** శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా బాజీ జంక్షన్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 91వ వార్డు సరోజినీదేవి ప్రాంతంలోని శ్రీరామనవమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మరియు బెహరా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయ చైతన్య ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో సీతారాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేరేడ్ల సత్యనారాయణ రెడ్డి, వై శ్రీను, తంబి రెడ్డి వంటి ప్రముఖులు పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరయ్యారు. భక్తులు కలసికట్టుగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈ వేడుకలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, గ్రామంలో ఐక్యతను ప్రతిబింబించాయి. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షిస్తూ ముగిసింది.

## శ్రీరామనవమి వేడుకల్లో జనసేన నాయకులు బెహరా చైతన్య





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చ్ 27 :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని 92వ వార్డు నందమూరినగర్, కంపరపాలెం ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక దేవాలయాల్లో ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తులతో కిటకిటలాడాయి. జనసేన పార్టీ నాయకులు మరియు బెహరా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయ చైతన్య ఈ వేడుకల్లో పాల్గొని శ్రీ సీతారాములవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధవళ గోపాల్, బండారు నాగేశ్వరరావు, ధవళ మోహన్, రాము మాస్టర్, కంపర రామకృష్ణ, అట్టా శంకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. ఆధ్యాత్మిక సందేశంతో ముగిసిన వేడుకలు

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తుల హృదయాలను హత్తుకున్నాయి. శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మపరమైన జీవన విధానం వంటి విలువలను ప్రజలకు తెలియజేస్తూ ఈ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

## వైభవంగా శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు





**హైదరాబాద్, కోకాపేట, పెన్ పవర్, మార్చి 27 :** విశాఖ శ్రీ శారదా పీఠంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. పీఠ ప్రాంగణం అంతా ఆధ్యాత్మికతతో మార్మోగింది. వేదమంత్రోచ్చారణల మధ్య ఆరాధన కార్యక్రమాలు ఉదయం శారదా చంద్రమౌళీశ్వర ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పూజలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ముత్యాల తలంబ్రాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ దృశ్యాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు న్యాయమూర్తులు శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమానికి మరింత గంభీరత చేకూరింది. పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. "రామః విగ్రహవాన్ ధర్మః" అని పేర్కొంటూ శ్రీరాముడు ధర్మానికి ప్రతిరూపమని వివరించారు. యువత శ్రీరాముడి ఆదర్శాలను అనుసరించాలని పీఠాధిపతులు సూచించారు. రామాయణంలోని బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని, వాటిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. శ్రీరాముడి జీవన విధానాన్ని అనుసరించే సమాజమే "రామ రాజ్యం"గా రూపుదిద్దుకుంటుందని మహాస్వామివారు పేర్కొన్నారు. ధర్మాన్ని ఆచరించే సమాజం నిర్మాణమే ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్, పాట్నా హైకోర్టులకు చెందిన న్యాయమూర్తులు, ప్రముఖులు, ఆధ్యాత్మిక నాయకులు, గాయకులు పాల్గొన్నారు. వారి హాజరు కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తెచ్చింది. పీఠంలో నిర్వహించిన హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారాముల దివ్య కటాక్షం పొందేందుకు భక్తులు ఉత్సాహంగా హాజరయ్యారు. మొత్తం మీద, ఈ శ్రీరామనవమి వేడుకలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయం కలగలిపిన మహోత్సవంగా నిలిచాయి.

## కాకి గంగరాజు ఆధ్వర్యంలో శ్రీరామనవమి



**విశాఖ తూర్పు,పెన్ పవర్,** 11 వ వార్డు అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సందర్భంగా గాంధీనగర్ లో అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు కాకి గంగరాజు ఆధ్వర్యంలో శ్రీ సీతా రాముల కళ్యాణం వేద పండితుల నడుమ ఘనంగా నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమంలో300 మంది దంపతులు పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొని అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు సుమారు 3000 మంది సమీప ప్రాంత ప్రజలు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ11వ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు. 12వ వార్డు ఇన్చార్జ్ ఒమ్మి అప్పలరాజు. పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామ ప్రజలకు అర్చకులు బలరామకృష్ణ శాస్త్రి,అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు ముది అప్పారావు. కుందూరు శ్రీను. చిన్నా. కృష్ణ. రమణ. పప్పు నానాజీ. మంగరాజు. సింహాద్రి శేఖర్ సంతోష్ కుమార్. జామి శివ. శ్రీను. లక్ష్మణరావు. గోవింద్. నూకరాజు. సంతోష్ కుమార్. సంతు. బుజ్జి జామి చంటి. జామిరాజు. చుక్క విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ రామనవమి మహోత్సవం నిర్వహణ

### పైడితల్లమ్మ గుడి వద్ద వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చ్ 27 :** శ్రీ రామనవమి పండుగ సందర్భంగా పశ్చిమలో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా చేశారు. ఎమ్మెల్యే గణబాబు వారి నివాసం నుండి పైడితల్లమ్మ గుడి వరకు శ్రీ సీతారాములవారికి సారేని ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు హర్షధ్వానాలతో, మంగళవాయిద్యాలతో ఈ ఊరేగింపును స్వాగతించారు. ఊరేగింపు మార్గమంతా భక్తి గీతాలతో మార్మోగింది. తదనంతరం గుడి వద్ద జరిగిన శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవంలో గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, వేదమంత్రాల నడుమ కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దైవ దర్శనం పొందారు. కల్యాణ మహోత్సవం అనంతరం నిర్వహించిన అన్నసమరదాన కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా తీర్థ ప్రసాదాలు అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తి, సేవా భావాల సమ్మేళనం

ఈ కార్యక్రమం భక్తి, సేవా భావాలకు ప్రతీకగా నిలిచింది. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ రామనవమి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

# చాపరాతిపాలెంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 27:** అల్లూరి జిల్లా జీకే వీధి మండలంలోని చాపరాతిపాలెం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద సంకల్ప సేవా ట్రస్ట్ మరియు దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామాలయం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న రామభక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ట్రస్టుల ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయంతో శ్రీరాములవారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు, దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 63కు పైగా దేవస్థానాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఆర్థిక సహాయం అందిస్తున్న వేద సంకల్ప సేవా ట్రస్ట్, దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్‌లకు భక్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



# చీకటి రహిత వార్డుగా 48వ వార్డుని నెలకొల్పడమే గంకల లక్ష్యం





* పండుగలు,ఎండ,వాన,తుఫాన్ లతో గుడ్ మార్నింగ్ గంకలకు సంబంధం లేదు
* పగలు రాత్రి తేడా లేకుండా వార్డు అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న గంకల కవిత అప్పారావు యాదవ్

**విశాఖ మార్చి 27(పెన్ పవర్):**చీకటి రహిత వార్డుగా 48వ వార్డుని నెలకొల్పడమే గుడ్ మార్నింగ్ గంకల లక్ష్యమని,పండుగలు,ఎండ,వాన,తుఫాన్ లతో గుడ్ మార్నింగ్ గంకలకు సంబంధం లేదని,సమస్యలు పరిష్కారం అయ్యి ప్రజలు ఆనందంగా ఉన్న రోజే తనకు పండుగ రోజు అని 48వ వార్డు మాజీ కార్పొరేటర్, మాజీ జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్,మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ అన్నారు.జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్, నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గంకల కవిత అప్పారావు యాదవ్ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు పలుమార్లు వినతులు చేశారు.గంకల కవిత అప్పారావు యాదవ్ పిర్యాదుపై అధికారులు స్పందించి శుక్రవారం వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా 48వ వార్డునకు రూ.16.5 లక్షలతో నూతన రింగ్ పోల్స్,6 మీటర్ల పోల్స్ 35,45 వీధి దీపాలు కేటాయించినట్లు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.ఇందులో భాగంగా వార్డులో గల జై భారత్ నగర్,ఇందిరానగర్ -3, ఇందిరానగర్-5,బాపూజీ నగర్ లో ఏ ప్రాంతంలో ఎలక్ట్రికల్ రింగ్ పోల్స్ అవసరం ఉన్నది అనేది అధికారులతో కలిసి గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటించి రింగ్ పోల్స్ ఏర్పాటు చేసి వాటికి నూతన వీధి దీపాలను ఏర్పాటు చేసి కొబ్బరికాయ కొట్టి వాటిని ప్రారంభించారు.పగలు, రాత్రి తేడా లేకుండా ఉదయం నుంచి కార్మికులతో కలిసి మధ్యాహ్నం భోజనం విరామం లేకుండా కార్మికులతో రాత్రి వరకు ఉండి వార్డులో నూతన పోల్స్,లైట్స్ ఏర్పాటుకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డు అంతా కొండ ప్రాంతం కావడంతో చీకటి ప్రదేశం నెలకొంటుందని,ఈ చీకటి ప్రదేశంలో ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని పలుమార్లు కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు వార్డులో నూతన రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి అందజేయడం జరిగిందని, ఇదే విషయంపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డులో రింగ్ పోల్స్ అవశ్యకత ఉందని ప్రజల ద్వారా తెలుసుకొని గత ఐదు ఏళ్లగా పోరాటం చేశామని ఈ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.పలు మార్లు అందించిన వినతులపై జీవీఎంసీ కమిషనర్,మేయర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్పందించి వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ కేటాయించడం జరిగిందని,వాటిని జై భారత్ నగర్,ఇందిరానగర్ -3, ఇందిరానగర్-5,బాపూజీ నగర్ లో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.త్వరలో మరి కొన్ని చోట్ల హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేసి వార్డు అంతట విద్యుత్ దీపాల వెలుగులను కురిపిస్తామన్నారు. వార్డులో అధికారులతో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చినట్లు గంకల పేర్కొన్నారు. అతి త్వరలో వార్డులో మరిన్ని వీధి దీపాలు,సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని గంకల హామీ ఇచ్చారు.ప్రతి క్షణం వార్డు అభివృద్ధి కోసమే కృషి చేయడం జరుగుతుందని,,పండుగలు,ఎండ,వాన,తుఫాన్ లతో గుడ్ మార్నింగ్ గంకలకు సంబంధం లేదని,సమస్యలు పరిష్కారం అయ్యి ప్రజలు ఆనందంగా ఉన్న రోజే తనకు పండుగ రోజు అని పేర్కొన్నారు.48వ వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు పట్ల గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి ఫలించిందని, వార్డులో గంకల కవిత అప్పారావు యాదవ్ కృషితో నూతన వెలుగులు వెలగడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ సూచించారు.

## రోడ్లపై పశువులతో ప్రమాదాలు .. పోలీసుల హెచ్చరికలు బేఖాతరు..!

గుంపులుగా తిరుగుతూ ప్రమాదాల కారణం అవుతున్న మూగజీవాలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 27:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి,చింతపల్లి మండలంలో పశువులను రోడ్లపై వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రంపుల గ్రామంలో జాతీయ రహదారిపైకి పశువులు రావడంతో ఆ మార్గంలో వస్తున్న వాహనాలు వాటిని ఢీకొని మూడు పశువులు మృతి చెందడంతో పాటు ఆవాహన చోదకులకు తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి మండలంలో పశువులను తప్పించబోయి వాహనదారులు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యారు. ఇలా రోడ్లపై పశువులు మూగజీవాలు రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనలపై అప్రమత్తమైన జీకేవీధి పోలీసులు పశువులను రోడ్లమీద వదిలేస్తే వాటి యజమానుల మీద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు పశువుల యజమానులకు అవగాహన కూడా కల్పించారు. అయితే యజమానుల్లో మార్పు రాలేదు. పశువులను వదిలేయడంతో అవి రోడ్డు మీదకు రావడం గుంపులుగా తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్న పశువుల యజమానులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. దీంతో పశువులు రోడ్లమీదకి రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. పెదవలస చింతపల్లి జాతీయ రహదారి తో పాటు, రింతాడ జీకే వీధి ప్రధాన రాయలపై ఈ పశువులు సంచారం అధికంగా ఉంటోంది. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## విశాఖలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

* పలు ప్రాంతాల్లో కల్యాణోత్సవాల్లో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 27 :**విశాఖపట్నం నగరంలో శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగి న శ్రీ సీతారాముల కల్యాణోత్సవాల్లో వీఎంఆ ర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ముఖ్య అ తిథిగా పాల్గొని, భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.పాత వెంకోజీపాలెం సమీపంలోని శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న ఆయన, సీతారాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కృష్ణా కళాశాల రోడ్డులోని ఏలియన్స్ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల ఆవరణలో నిర్వ హించిన కార్యక్రమంలో కళాశాల యాజమా న్యం, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

పెదవాల్తేర్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి కల్యాణం అత్యంత వైభ వంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చై ర్మన్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వ హించారు. కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.చిన్మయ మిషన్ ఆవరణలో, అలా గే ఉత్తర నియోజకవర్గంలోని రేసపువాని పాలెం రామాలయంలో జరిగిన కల్యాణోత్సవాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. రేసపువాని పాలెం లో నిర్వహించిన అన్నప్రసాద పంపిణీ కార్య క్రమంలో భక్తులకు స్వయంగా అన్నం వడ్డించా రు.వినాయకనగర్లోని శివాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొని, అనంత రం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సీతంపేటలో సంపంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ విష్ణు కుమార్ రాజుతో కలిసి పాల్గొని, శ్రీరామచంద్ర మూర్తికి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.సీతంపేట శివాలయం సమీపంలోని రామాలయంలో జరిగిన కల్యాణంలో కూడా పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. బీచ్ రోడ్ పాండురంగ స్వామి వీధిలో సన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల క ల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సత్కరించారు.

ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన ఎం.వి. ప్రణవ్ గోపాల్ నగర ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీరాముని ఆశీ స్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండా లని ఆకాంక్షించారు.

## శ్రీరామనవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొనడం

"ప్రజల సంక్షేమమే నిజమైన రామరాజ్యం"



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 27 :**శ్రీరామనవమి సందర్భంగా 33వ వార్డు పరిధి లోని అల్లిపురం కుమ్మర వీధిలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్సీపీ సమన్వయకర్త, దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ భక్తులతో కలిసి స్వామివారి పల్లకి ఊరేగింపులో పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, సుపరిపాలన, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వంటి లక్షణాలు ఉన్న పరిపాల నే నిజమైన "రామరాజ్యం" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించే సమా జం ఏర్పడాలని ఆకాంక్షించారు.మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇ చ్చిన హామీలను నిలబెట్టుకుని సంక్షేమం, అభి వృద్ధి కార్యక్రమాలను అమలు చేశారని తెలిపా రు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రజలకు మేలు చేసే పాలన అవసరమని అభిప్రాయపడ్డారు.

33వ వార్డులో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని, దేశవ్యాప్తంగా శ్రీరామనా మ స్మరణ మార్మోగుతుండటం సంతోషకరమని అన్నారు. అలాగే ప్రజలందరికీ, పార్టీ కార్యకర్త లకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామ రాజు, వార్డు నాయకులు, మహిళా నేతలు మరియు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సింహాచలంలో సీతారాముల కళ్యాణం నిర్వహణ

### పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఈవో దంపతులు





**సింహాచలం, పెన్ పవర్, మార్చి 27 :** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని సింహగిరిపై భక్తి వాతావరణం అలుముకుంది. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సింహాచల పుణ్యక్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి కళ్యాణ వేడుకను తిలకించారు. గంగధార సమీపంలోని శ్రీ సీతారామస్వామి ఆలయం, అలాగే రాజగోపురం ఎదురుగా ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దేవస్థానం ఈవో జె. వెంకటరావు దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, ఫలపుష్పాలను సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ప్రదక్షిణ చేసి కళ్యాణ వేదికకు చేరుకున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు మరియు వేద పండితులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు.


విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ వంటి క్రతువులతో ప్రారంభించారు.

సుముహూర్తాన జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ ఘట్టాలు కనువిందుగా జరిగాయి. స్వామి, అమ్మవార్ల శిరస్సుపై ముత్యాల తలంబ్రాల వర్షం కురవడంతో భక్తులు ఆనందోత్సాహాలతో నిండిపోయారు. కళ్యాణం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేయగా, మహిళలకు ప్రత్యేకంగా బ్లౌజ్ పీసులు కానుకగా అందజేశారు. మంత్రపుష్పం, మంగళాశాసనాలతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఈవో జె.వెంకటరావు మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం లోకక్షేమానికి సంకేతం. స్వామివారి మహిమను ప్రతిబింబించేలా ఈ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించాం. అధికారులు, సిబ్బంది, భక్తుల సహకారంతో ఈ మహోత్సవం విజయవంతమైంది" అని తెలిపారు. సహాయ ఈవోలు మరియు దేవస్థానం అధికారులు సమన్వయంతో దర్శనం, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించారు. సింహాచలంలో జరిగిన ఈ శ్రీ సీతారాముల కళ్యాణం భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలిచి భక్తుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచింది.

## రామతీర్థంలో సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పణ

### సింహాచలం ఈవోకి ఘన స్వాగతం పలికిన రామతీర్థం దేవస్థానం





**సింహాచలం, పెన్ పవర్, మార్చి 27 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయం ప్రకారం, ఈ సంవత్సరం కూడా శ్రీరామనవమి సందర్భంగా రామతీర్థంలోని సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు ఘనంగా సమర్పించారు. శుక్రవారం శ్రీ రామనవమి సందర్భంగా రామతీర్థంలో వెలసిన సీతారాముల వారి దివ్య కళ్యాణ మహోత్సవానికి సింహాచలం దేవస్థానం తరపున ఆలయ కార్యనిర్వహణాధికారి జలేపల్లి వెంకటరావు దంపతులు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా రామతీర్థం చేరుకున్న సింహాచలం ఈవో దంపతులకు, అర్చక బృందానికి అక్కడి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాదస్వర మేళతాళాలు, వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం వేదమంత్రాల మధ్య సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది. పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం సింహాచలం ఈవో దంపతులకు స్వామివారి దర్శనం కల్పించి, శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమం ద్వారా రెండు క్షేత్రాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం మరింత బలపడినట్లు భక్తులు అభిప్రాయపడ్డారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ సంప్రదాయం భక్తులలో విశేష భక్తి, ఆనందాన్ని నింపుతోంది.

## పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణం ఉత్సవ



**పద్మనాభం, పెన్ పవర్, మార్చి 27 :**పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి. వికేపాలెం. మద్ది. కోరాడ బీఆర్ తాలవలస అయినాడా అనంతవరం గందవరం. గ్రామాల్లో ఆయా రామాలయాల్లో ఉదయం నాలుగు గంటల నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ముందుగా వధూవరులైన సీతారాములవారిని పల్లకిలో పూరేగించారు. అయినాడ గ్రామంలో సాంప్రదాయబద్ధంగా సీతారాముల కళ్యాణాన్ని జరిపించారు ఈ సందర్భంగా కన్యాదాన కార్యక్రమాన్ని ఆక ట్టుకునే విధంగా పురోహితులు ఘనంగా ఏర్పాటు చేసి నిర్వహించారు ఈ సన్నివేశం భక్తులకు ఎంతో ఉత్సాహాన్ని కలుగజేసింది ఈ కార్యక్రమంలో కె రమణ ఎం శివ కే లీలావతి లక్ష్మణ కే నగేష్ కుమార్ దంపతులు పాల్గొని కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com